తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 35 పేజీలు: 4 ఎడిటర్ : బక్కరవీందర్ ప్రచురణ: తెలంగాణ గురువారం 5-09-2023 వెల: 5/రూ -



# వరద బాధితులకు బీఆర్ఎస్ విరాళం

**పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల ఒక నెల వేతనం సాయంగా ప్రకటన**

**మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి**

**విపత్తు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.. మాజీ మంత్రి హరీశ్‌రావు**

సిద్దిపేట: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల తరఫున ఒక నెల వేతనం విరాళంగా ఇస్తున్నట్లు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. వరదల్లో సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు ఇప్పటికే పార్టీ తరఫున సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల కష్టాల్లో ఎప్పుడూ తోడుగా నిలిచే బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత విపత్తులోనూ వారికి అండగా ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా ముందుకు రావాలని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

2లో

# రైతులకు సోలార్ పంప్‌సెట్లు

**పైలట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లె**

**అటవీ భూములు, ఖాళీ స్థలాల్లో సౌర విద్యుదుత్పత్తికి చర్యలు**

**మహిళలకు ఎ ల్పిజీకి బదులుసోలార్ సిలిండర్లు**

**విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**



హైదరాబాద్: రైతులకు ఉచితంగా సోలార్ పవర్ పంప్‌సెట్లను పంపిణీ చేసి, సౌర విద్యుత్ వినియోగించేలా వారిని ప్రోత్సహించాలని ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తన సొంత గ్రామం కొండారెడ్డి పల్లెను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. సోలార్ పవర్‌తో వచ్చే విద్యుత్‌ను రైతు పంప్‌సెట్లకు వాడుకోగా మిగిలే విద్యుత్‌తో వారికి ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. బుధవా రం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ఒక బిజినెస్ హబ్‌గా మారబోతోందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యు త్ అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇందుకు గాను ఐటీ, పరిశ్రమల శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# తెలంగాణ సీఎస్‌పై కేంద్రం సీరియస్

2లో



# కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫొగాట్?

న్యూఢిల్లీ,: ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం ఖాయమైనట్లు కనిపిస్తోంది. బుధవారం ఆమె రాహుల్ గాంధీతో సమావేశమవడం చర్చనీయాంశమైంది.



2లో

# అధికార ముసుగులో... అరాచకాలు

**ఎన్నాళ్ళు ఇంకా........**

**యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన**

**భేల్ కార్మికుడిపై కేసు........**

భేల్ క్రైమ్ ప్రతినిధి ప్రదీప్, సెప్టెంబర్ 04 (డైలీ రిపోర్ట్): రామచంద్రాపురం. ఒక ఆడపిల్ల ఆవేదన..యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన బి హెచ్ ఈ ఎల్ (భేల్ ) కార్మికుడి పై

# కెసిఆర్ మాదిరిగా ఫామ్‌హౌజ్‌లో కూర్చోలేదు

2లో

**వరదల్లో ప్రజలను ఆదుకునేందుకు వెళ్లాం**

**బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొంగులేటి ఎద్దేవా**

**మృతి చెందిన తండ్రీ కూతుళ్లకు నివాళి..చెక్ అందచేత**

# నరేంద్ర మోదీ గారూ.. స్వాగతం

**ఘనంగా ఆహ్వానించిన సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్**

సింగపూర్, సెప్టెంబరు 4: విదేశా ల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం సింగపూర్‌కు చేరుకొన్నారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ మోదీని ఘనంగా ఆహ్వానించారు. ప్రతిష్టాత్మక శ్రీ తెమాసెక్ భవనంలో ఆతిథ్యం ఇచ్చారు.

2లో





# జైనూరులో ఉద్రిక్తత

**మహిళపై అత్యాచారయత్నం ఘటనపై బాధిత వర్గం నిరసన**

**నిందితుడి ఇల్లు, ఆటోతో పాటు 50కి పైగా దుకాణాలకు నిప్పు**

**పలు వాహనాలు, బైకులు ధ్వంసం**

**పట్టణంలో కర్ఫ్యూ..నిషేధాజ్ఞలు: డీజీపీ**

హైదరాబాద్: గత ఆదివారం ఓ మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారయత్నం చేయడంతో పాటు హత్యకు ప్రయత్నించిన ఘటన మంగళవారం వెలుగులోకి రావడం, బాధిత వర్గం పెద్దయెత్తున ఆందోళనకు దిగడంతో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. నిరసనకారులు బుధవారం ఉదయం నిందితుడి ఇళ్లు, ఆటోను తగలబెట్టడంతో

# సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మెరుగైన సేవలకు ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి వినతి

**సంగారెడ్డి సెప్టెంబర్ (డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు డిమాండ్ ల తో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడీ ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. అనిల్ కుమార్ కి వినతి పత్రం ఇచ్చిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి బోధన ఆసుపత్రి గా మారడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని దాని వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు మరియు మందుల కొరత లేకుండా చూడాలని, దివ్యంగులకు, వృద్దులకు ప్రత్యేక ఓ పి కౌంటర్ లు ఏర్పాటు చేయాలని,గర్భిణీ లకు ప్రసుతి ఇతర రోగులకు మెరుగైన శాస్త్రా చికిత్స విధానాన్ని అమలులో చేయాలని, రోగులకు మెనూ ప్రకారం అల్పాహారం ఆహారం మరియు శుద్ధి చేసిన త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ అంబులెన్సు లు రోగులకు అందుబాటులో ఉంచి ప్రయివేట్ అంబులెన్సు ల దోపిడీ ని ఆసుపత్రి ప్రాంగణంలో నివారించాలని,అత్యవసర సేవల విభాగం లో బెండ్ల సంఖ్య పెంచి రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగిందని వివరించారు ఇట్టి కార్యక్రమంలో ఫోరమ్ సహా కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి వరాల రాజు మార్కుంది తదితరులు పాల్గొన్నారు.



# వరద బాధితులకు బీఆర్ఎస్ విరాళం

(మొదటి పేజీ తరువాయి)

విపత్తు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విషయం మరోమారు తేటతెల్లమైందని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో వరద ప్రభావంపై కేంద్రానికి ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇవ్వలేదని కేంద్ర హెూం శాఖ లేఖ రాయడాన్ని ఆయన ఉదాహరించారు. ప్రభుత్వ ఖాతాలో ఉన్న రూ.1,345.15 కోట్ల ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల వినియోగంలో రేవంత్ సర్కారు మౌనంగా ఉందన్నారు. విపత్తు నిర్వహణ నిధులున్నా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాదికి సంబంధించి రూ.208 కోట్ల ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జూన్ నెలలోనే జమ అయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం రాష్ట్ర ప్రజలకు శాపమని ఆయన మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్‌టైమ్ లెక్చరర్లు, టీచర్లను ప్రభుత్వం తొలగించడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి మీరిచ్చే కానుక ఇదేనా సీఎం గారూ? అంటూ ప్రశ్నించారు. మూడు నెలలుగా పెండింగులో ఉన్న జీతాలు అడిగిన పాపానికి ఉద్యోగాల నుంచి తొలగించడమే ప్రజాపాలనా అని నిలదీశారు. వరద బాధితులకోసం గురువారం సిద్దిపేట నుంచి ఖమ్మంకు ఆరు లారీల్లో నిత్యావసర సరుకులు పంపిస్తామని హరీశ్‌రావు తెలిపారు. బుధవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ, వరదల కారణంగా మృతిచెందినవారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను హరీశ్‌రావు పరిశీలించారు. రైతులు నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ. 30 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. భక్తరామదాసు, పాలమూరు పంప్‌హౌస్‌లు మునిగిపోతే ప్రభుత్వం వాటి వివరాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతు దేవయ్యకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కాగా, సిద్దిపేటలో పలువురు స్థానికులు వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు విరాళాలు ప్రకటించారు.

# తెలంగాణ సీఎస్‌పై సీరియస్

(మొదటి పేజీ తరువాయి)



ఢిల్లీ: కొద్ది రోజులుగా తెలంగాణలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా రాష్ట్రంలో తీవ్ర నష్టం ఏర్పడింది. పలుచోట్ల ఇళ్లు కూలిపోయి, ఇంట్లోకి నీరు చేరడంతో బాధితులకు తీవ్ర నష్టం జరిగింది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా పంటలకు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో వరద నష్టం వివరాలు రాష్ట్రం పంపించక పోవడంపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. తాజాగా, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి కేంద్ర హెూంశాఖ లేఖ రాసింది. ఈ సందర్భంగా తెలంగాణ వరద నష్టం వివరాలు కేంద్రానికి పంపక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో వరద నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్‌లో తక్షణమే పంపాలని హెూం శాఖ సూచించింది. రూ.1,345 కోట్లు ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే, వరదల సందర్భంగా సాయం కోసం ఇప్పటికే 12 ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు, రెండు హెలికాప్టర్లు పంపించినట్లు లేఖలో పేర్కొంది.ఇక, ఎస్‌డీఆర్ఎఫ్ నిధికి కేంద్రం వాటా నిధుల విడుదల కోసం తక్షణమే వివరాలు పంపాలని ఆదేశించింది. ఇదే సమయంలో జూన్‌లో రూ.208కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతి రాలేదని కేంద్రం స్పష్టం చేసింది. ఇది వరకు ఖర్చు చేసిన వాటి యుటీలైజేషన్ సర్టిఫికెట్స్, వరద నష్టం వివరాలు పంపాలని కోరింది. వరద నష్టం వివరాలను ఎప్పటికప్పుడు రోజువారీగా పంపించాలని లేఖలో పేర్కొంది.

# కెసిఆర్ మాదిరిగా ఫామ్‌హౌజ్‌లో కూర్చోలేదు


(మొదటి పేజీ తరువాయి)



ఖమ్మం: కెసిఆర్ మాదిరిగా విదేశీ కుట్ర అంటూ ఫాంహౌస్‌లో కూర్చోలేదని, చినుకు పడిన క్షణం నుంచి ప్రజల్లోనే ఉన్నామని, మా ముందస్తు చర్యల వల్ల వీలైనంత ప్రాణ నష్టం తగ్గించ గలిగామని, గత ప్రభుత్వం పదేళ్లలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజల రక్షణెళి తమకు ముఖ్యమన్నారు. వరదలపై ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి పొంగులేటి తప్పుబట్టారు. దీనికి సంబంధించి మంత్రి పొంగులేటి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చిన భారీ వర్షాలు, వరదలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వారి వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి క్లౌడ్-బరస్ట్, విదేశీ కుట్ర అంటూ మతిలేని ప్రకటనలు చేసిన బిఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆ ప్రకటనలో ప్రశ్నించారు. విదేశీ కుట్ర అని ఫాంహౌస్ దాటని బిఆర్ఎస్ పార్టీ పెద్దలు ఈరోజు వరదల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆనాడు ప్రకృతిపరంగా కురిసిన వర్షాలను కూడా కుట్రకోణంలో చూసిన ఆ పెద్దమనిషి, ఆయన అల్లుడు హరీష్ రావు కూడా ఇప్పుడు వచ్చిన వర్షాలను కుట్ర కోణంలోనే చూస్తున్నారా అని మంత్రి వ్యాఖ్యానించారు.ఇదిలావుంటే నేలకొండపల్లి ప్రాంతంలో మంత్రి పర్యటించి పునరావాస చర్యలను పరిశీలించారు. అలాగే వరదల్లో కొట్టుకు పోయిన తండ్రీకూతుళ్ల ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి 5 లక్షల చెక్కును అందచేశారు.

# అధికార ముసుగులో...అరాచకాలు

(మొదటి పేజీ తరువాయి)


FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)

రామచంద్రాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారంభేల్ ఎల్ఐజీ కాలనీలో నివాసము ఉంటున్న, శక్తి శ్రీనిధి (20) కొండాపూర్ లోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది.రోజులాగే రాత్రి 8 గంటల సమయంలో బీ హెచ్ ఈఎల్ మీదుగా తన బంధువుతో కలిసి ఇంటికి వెళ్తున్నది.ఈ క్రమంలో ఆమె బంధువు మూత్ర విసర్జనకు బైక్ ఆపి పక్కకు వెళ్ళాడు. ఇదే సమయంలో భేల్ సెక్యూరిటీ వాహనం ఆమె వద్దకు వచ్చి నిలిచింది.అందులో నుంచి బయటకు దిగిన వ్యక్తి ఇక్కడ ఏం చేస్తున్నావ్..? అంటూ దూర్భాషలకు దిగాడు. ఇంతలో ఆమె బంధువు వచ్చి ఏమి జరిగిందని ప్రశ్నిస్తుండగా జీపులోని ముగ్గురు వ్యక్తులు కర్రలతో వారిని చితకబాదారు. అంతటితో ఆగకుండా సదరు యువతి ముఖంపై లైట్లు వేసి వీడియో చిత్రీకరిస్తూ నా పేరు గణేష్.... నేను భేల్ ఉద్యోగిని 'ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దురుసుగా వ్యవహారించారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిన సదరు మహిళ శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

ఈ మేరకు ఎస్ ఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారని సిఐ జగన్నాథ్ తెలిపారు.

# రైతులకు సోలార్ పంప్‌సెట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్య లు తీసుకోవాలని చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించిన వినియోగంలో లేని ఖాళీ భూములతో పాటు అటవీ భూముల్లో సౌర విద్యుదుత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్పీ జీ గ్యాస్ సిలిండర్‌కు బదులుగా మహిళలు సోలార్ సిలిండర్ వినియోగించేలా ప్రోత్సహించాలని చెప్పారు. మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వడం ద్వారా సోలార్ సిలిండర్ వ్యాపారం వైపు వారిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా నిమిషం కూడా విద్యు త్ సరఫరాలో అంతరాయం కలగకూడదని, ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.

# నరేంద్ర మోదీ గారూ.. స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా "నరేంద్ర మోదీ గారు.. సింగపూర్‌కు స్వాగ తం" అంటూ మోదీతో కలిసి ఉన్న ఫొటోను ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. గురువారం వీరిరువురూ అధికారికంగా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా పలు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేయను న్నారు. లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకే మోదీ సింగపూర్ పర్యటనకు వెళ్లారు. ఆ దేశం నుంచి పెట్టుబడులను ఆకర్షించడం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మోదీ సింగపూర్‌లో పర్యటిస్తున్నట్లు విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని హెూదాలో మోదీ సింగపూర్‌లో పర్యటించడం ఇది ఐదోసారి. మరోవైపు, గురువారమే సింగపూర్ పార్లమెంటుహౌస్‌లో ఆ దేశ అధ్యక్షుడు షణ్ముగరత్నంను మోదీ కలుసుకోనున్నారు. సింగపూర్‌లో వ్యాపారవేత్తలతో కూడా భేటీ కానున్నారు. అంతకుముందు మోదీ బ్రూనై పర్యటనలో ఆ దేశ సుల్తాన్ హసనల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని కీలక ప్రకటన చేశారు. త్వరలో రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

# గౌరవంగా రాజీనామా చేయండి

(మొదటి పేజీ తరువాయి)

'కోర్టు తీర్పు ఇచ్చాక వంద శాతం సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుంది. తీర్పు రాకముందే గౌరవంగా రాజీనామా చేయమని సూచిస్తున్నా. ఆయన ప్రమేయం ఉన్న కుంభకోణాలన్నీ నిరూపితం అయినందున, ఇక తప్పించుకునే అవకాశం లేదు' అని పేర్కొన్నారు. సిద్ధరామయ్యపై విచారణ జరగకుండా సెప్టెంబర్ 9 వరకు మధ్యంతర స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే.

# జైనూరులో ఉద్రిక్తత

మొదలైన విధ్వంసం సాయంత్రం వరకూ కొనసాగింది. పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చిన బాధిత వర్గం మరో వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగింది. వారికి చెందిన రెండు ప్రార్థనా మందిరాల్లో ఫర్నిచర్ కొందరు ధ్వంసం చేశారు. నాయకులపై దాడి చేయడమే కాకుండా వారి ఇళ్లపై రాళ్ల వర్షం కురిపించారు. ఇళ్లల్లోకి చొరబడి సామాగ్రి పగులగొట్టారు. కార్లు, మాక్సీ క్యాబ్‌లు, బైక్‌లను ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. 100కు పైగా దుకాణాలను తగులబెట్టారు. నిందితుడికి చెందిన వర్గం జైనూరు వదిలి మైదాన ప్రాంతానికి తరలి పోవాలని డిమాండ్ చేశారు. వేలాది మంది బాధిత వర్గం వారు పట్టణంలోకి చేరుకుని ఒక్కసారిగా విధ్వంసానికి పాల్పడడం, ఇంకోవైపు మరోవర్గం కూడా కొన్నిచోట్ల దాడులకు దిగడంతో వారిని నిలువరించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. కాగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు నేతృత్వంలో బాధిత వర్గాన్ని శాంతింప జేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇరువర్గాల వారు సంయమనం పాటించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో కోరారు.

# కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫొగాట్?

వినేశ్‌తో పాటు బజరంగ్ పునియా కూడా రాహుల్‌ను కలిశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. ఎన్నికల్లో వినేశ్, పునియా పోటీ ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జులానా స్థానం నుంచి వినేశ్‌ను బరిలో దింపాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. ఇక పునియాను బద్లి స్థానం నుంచి పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోతే ఏఐసీసీలో కీలక పదవిని ఇస్తారన్న ప్రచారంకూడా జరుగుతోంది. వీరిద్దరి చేరికతో హరియాణాలో జాట్‌ల ఓట్లు కాంగ్రెసకు అనుకూలంగా మరింత సంఘటితమవుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఫొగాట్ కాంగ్రెస్ తరపున పోటీ చేసినా, ప్రచారం చేసినా పెద్ద సంఖ్యలో ఓట్లు వస్తాయని,

# 'రాయికోడ్' డిమాండ్ ఇంకెంత దూరం?

**రాయికోడ్ పై చిన్నచూపు వదిలి నియోజకవర్గం ఏర్పాటు చేయండి.**

**రాయికోడ్ మండల కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు కోసం డిమాండ్లు**

**బార్డర్ లో ఉండటం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదనే నైరాశ్యం**

**గతంలో జహీరాబాద్, నారాయణఖేడ్ ఇప్పుడు అందోల్.. విలీనాల గేమ్ లో అభివృద్ధి శూన్యం**

**రాజకీయ పదవుల్లోనూ సెకండ్ గ్రేడ్ సిటిజన్స్ గా మారిపోయామని మండల నాయకుల భావన**

**సోషల్ మీడియాలో 'సేవ్ రాయికోడ్.. వియ్ వాంట్ కాన్స్టిట్యూఎన్సీ' క్యాంపెయిన్**

**రోజు రోజుకు పెరుగుతున్న మద్దతు..**

**ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్లు**

సంగారెడ్డి సెప్టెంబర్ 04,(డైలీ రిపోర్ట్): దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ అనేది గత కొంత కాలంగా చర్చనీయాంశం అవుతున్నది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే 2026 అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ భౌగోళిక సరిహద్దులను ఓఆర్ఆర్ వరకు విస్తరించేలా ప్రణాళికలు రచిస్తున్నది. ఇక రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోనూ కొత్తగా అసెంబ్లీ నియోజకవర్గాల ప్రతిపాదనల డిమాండ్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలాన్ని సైతం నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలనే డిమాండ్లు క్రమంగా పెరుగుతున్నాయి. తమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవాలన్నా.. తమ ప్రాంతం వారికి రాజకీయ అస్తిత్వం దక్కాలన్నా రాయికోడ్ కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం రూపుదిద్దుకోవడమే పరిష్కార మార్గం అని, లేకుంటే పరాయిపాలనలో మగ్గినట్లుగానే ఈ ప్రాంత ప్రజల బతుకులు మారుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో 'సేవ్ రాయికోడ్.. వియ్ వాంట్ కాన్స్టిట్యూఎన్సీ' నినాదంతో క్యాంపెయిన్ మొదలైంది. ఎంత పెద్ద గమ్యం అయినా తొలి అడుగుతోనే ప్రారంభం అవుతుందన్న చందంగా కొంత మంది యువకులు సోషల్ మీడియాలో ప్రారంభించిన రాయికోడ్ నియోజకవర్గం ఏర్పాటు డిమాండ్ నినాదం క్రమంగా ఈ ప్రాంతంలో బలం పుంజుకుంటున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాదిరిగానే ప్రత్యేక రాష్ట్రంలోనూ తమ ప్రాంతం అభివృద్ధి, పదవుల విషయంలో జరుగుతున్న అన్యాయంపై క్రమంలో యువకులు, పెద్దల్లో ఆలోచన సరళి మారుతున్నది. దీంతో త్వరలో జరగబోయే నియోజరకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఈ ప్రాంతాన్ని నియోజకవర్గం సాధిస్తామనే కొత్త ఆశలు పురుడుపోసుకుంటున్నాయి.




## స్వరాష్ట్రంలోనూ పరాయి బతుకులే

రాయికోడ్ మండలం ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ లో భాగంగా ఉంది. ఈ మండలంలో 37 గ్రామాలు అందులో నాలుగు నిర్జన గ్రామాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ మండలం జనాభా మొత్తం 40,732 మంది. రాయికోడ్ మండలం మొదట్లో జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేది. 1957లో జహీరాబాద్ నియోజకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తే జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, రాయికోడ్, న్యాల్ కల్ మండలాలు ఈ సెగ్మెంట్ లో ఉండేవి. ఆ తర్వాత 1978 ఎన్నికల్లో న్యాల్ కల్ మండలాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గంలో విలీనం చేయగా 2009లో జహీరాబాద్, న్యాల్ కల్, కోహీర్, ఝరాసంగం మండలాలతో జహీరాబాద్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాయికోడ్ మండలాన్ని అందోల్ నియోజకవర్గంలో విలీనం చేశారు. రాయికోడ్ మండలం ఇటు జహీరాబాద్, అటు అందోల్, నారాయణ ఖేడ్ ఈ మూడు నియోజకవర్గాలకు బార్డర్ కావడం వల్ల ఇక్కడి ప్రజలతో ప్రభుత్వాలు విలీనం పేరుతో చెడుగుడు ఆడటమే తప్ప పూర్తి స్థాయిలో అభివృద్ధిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అభివృద్ధి పనులు, పార్టీలు, ప్రభుత్వ పదవులు అన్ని నియోజకవర్గ కేంద్రాలకు సమీప మండలాలకు చెందిన నేతలకే వరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాయికోడ్ మండలం వారికి సరైన ప్రాతినిథ్యం లేక అవకాశాల కోసం ఎదురు చూడటమే తప్పా మరో గత్యంతరం టాక్ వినిపిస్తోంది. తెలంగాణ ఏర్పడ్డాక కూడా ఇదే పరిస్థితి ఉందని ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా అందోల్ నియోజకవర్గంలో రాయికోడ్ మండల ప్రజలు సెకండ్ గ్రేట్ సిటిజన్లుగా మారుతున్నామనే ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి. అన్ని ఉన్నా అల్లుడినోట్లో శని అనే చందంగా అన్ని వనరులు ఉన్నా అభివృద్ధికి చొరవ తీసుకునే తమ ప్రాంత పాలకులు, నాయకులు లేకపోవడం తమకు శాపంగా మారుతుందనే ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి. రోడ్లు ధ్వసంమై దశాబ్దాలు గడుస్తున్నా తట్టెడు మట్టిపోసి ఈ ప్రాంత ప్రజల బతుకులకు కాస్త స్వాంతన కల్పిద్దామన్న సోయి దశాబ్దాలుగా పాలకులకు పట్టడం లేదు. డిగ్రీ కాళాశాల లేక ఎంతో మంది విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపేస్తే పట్టించుకునే దిక్కులేదు. ఇప్పటికీ రాయికోడ్ మండలంలోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదంటే ఈ ప్రాంతం పట్ల పాలకుల శీతకన్ను ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మౌళిక వసతుల కల్పన అంశాలు ఇలా ఉంటే ఇక పాలన వ్యవహారాల్లో, ప్రభుత్వ పదవులు, సీట్ల కేటాయింపుల్లో రాయికోడం మండలానికి మొదటి నుంచి మొండిచేయి చూపడం పార్టీలన్నిటికి పరిపాటిగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యమైన పదవులన్నీ నియోజవకవర్గ కేంద్రానికి సమీపంలో ఉన్న వారికే కట్టబెడుతూ బార్డర్ లో ఉన్న తమవరకు నామమాత్రపు పదవులతో సరిపెడుతున్నారనే విమర్శలు బగ్గుమంటున్నాయి.

## నియోజకవర్గం ఏర్పాటే పరిష్కారం: సామాజిక సేవ కార్యకర్త ఎల్గోయి ప్రసాద్

మొదటి నుంచి రాయికోడ్ మండలంపై వివక్ష జరుగుతూనే ఉంది. అభివృద్ధిలో, రాజకీయ, ప్రభుత్వ పదవుల్లో ఈ ప్రాంతానికి సరైన ప్రాతినిథ్యం దక్కడం లేదు. దాంతో మా గొంతు వినిపించే పరిస్థితులే లేవు. ఏ పదవులైనా, అభివృద్ధి పనులైనా మొదట అందోల్ నియోజకవర్గానికి భౌగోళికంగా సమీపంలో ఉన్న మండలాలకు ఫస్ట్ ప్రయార్టీ కల్పించి చివర్లో రాయికోడ్ మండలాన్నిను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఈ సమస్యకు రాయికోడ్ కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటు చేయడమే పరిష్కారం అని మేము నమ్ముతున్నాం. అందువల్ల రాయికోడ్ నియోజకవర్గం సాధనే లక్ష్యంగా ప్రస్తుతం సోషల్ మీడియాలో క్యాంపెయిన్ ప్రారంభించాం. తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై యువత సానుకూలంగా స్పందిస్తున్నదని. న్యాయమైన ఈ డిమాండ్ విషయంలో రాజకీయ పార్టీలు, విద్యార్థులు, మేధావులు విస్తృతంగా చర్చ చేయాలి. నిజానికి పెరిగిన జనాభా కారణంగా రాయికోడ్ మండలానికి చెందిన అనేక రెవెన్యూ గ్రామాలు మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి. వాటిని మండలాలుగా చేసి ఆతర్వాత రాయికోడ్ మండల కేంద్రంగా ఆ చుట్టు పక్కల మండలాలను కలుపుతూ కొత్త నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఈ విషయంలో సమిష్టిగా ప్రయత్నం చేస్తే తప్పక నెరవేరుతుందనే నమ్మకం మాకుంది. ఈ దిశగా మండల ప్రజల ఆదేశం మేరకు ప్రభుత్వం సానుకూల ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# ప్రజలు సంయమనం పాటించాలి - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్

**జైనూరు ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారి పై చర్యలు తీసుకోబడతాయి.**

**మతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తప్పవు.**

**సోషల్ మీడియా పై జిల్లా పోలీసుల నిఘా.. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు**

**జైనూరు నందు 144 సెక్షన్ అమలు, ఇతరులకు జైనూర్ వెళ్ళడానికి అనుమతి లేదు.**



అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: జైనుర్ నందు జరిగిన ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని, పోలీసు యంత్రాంగం కేసులను నమోదు చేసిందని, దర్యాప్తు కొనసాగుతుందని, కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని తెలిపారు. వదంతులను ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందని నిజా నిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ లపై చర్యలు తీసుకోబడతాయని, కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. ముఖ్యంగా జైనుర్ నందు 144 సెక్షన్ అమలులో ఉందని ఇతర ప్రాంతాలవారికి జైనూరు నందు అనుమతి లేదని, చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.తప్పు చేసిన వారికి శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

## తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల రెసిడెన్షియల్ ను సందర్శించిన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య





మొయినాబాద్ సెప్టెంబర్ 04:(డైలీ రిపోర్ట్ రిపోర్ట్):మొయినాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల రెసిడెన్షియల్ ను చేవెళ్ళ శాసనసభ్యులు కాలే యాదయ్య సందర్శించి, వంటగదిని పరిశీలించి మరియు విద్యార్థుల అనారోగ్య సమస్యల నుండి దూరంగా ఉండటానికి శుభ్రత పాటించి రుచికరమైన వంటకాలు విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థుల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు,వాతావరణ పరిస్థితులు కొత్తగా వచ్చిన నీటితో కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని,పక్కనున్న పరిసర ప్రాంతలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు.



# బురదమయంగా మారిన శంకర్ పల్లి రిత్విక్ కాలనీ రోడ్లు....



**శంకర్ పల్లిబీ సెప్టెంబర్ 04:(డైలీ రిపోర్ట్):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని రిత్విక్ వెంచర్లో కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయి. బుడదలో కాలనీవాసులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో 65 ఇండ్లు ఉన్నాయి. అందులో సుమారు 250 మంది ప్రజలు నివసిస్తున్నారు ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు పన్నుల రూపంలో స్థానిక మున్సిపల్ కార్యాలయానికి అందుతున్నాయి. ఈ కాలనీ ఏర్పడి సుమారు 14 సంవత్సరాల అయింది. ఆనాటి నుండి ఈనాడు వరకు కాలనీవాసులు సరైన రోడ్లు లేక కురిసిన వర్షానికి బుడదయంగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు అప్పటి గ్రామ పంచాయతీ అధికారులకు కాలిని రోడ్ల విషయం వివరించిన ఫలితం లేకుండా పోయిందని కాలినివాసులు వాపోతున్నారు. కాగా రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు స్మశాన వాటిక రోడ్డు ద్వారా కాలనీకి వచ్చే రోడ్డు ఒక ప్రక్క కూలిపోయింది. ఆనాటి నుండి ఈ బ్రిడ్జి పనులు చేపట్టాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు, నాయకులకు విన్నవిస్తూనే ఉన్నారు. స్మశాన వాటిక రోడ్డు కూడా బురదమయంగా మారింది. గొల్లవాగుపై నిర్మించిన కల్వర్టు ఒక పక్క కూలిపోయినందున మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ వ్యవసాయ మార్కెట్ కు చెందిన ప్రహరీ గోడను తొలగించి వాహనాలు పెరగడానికి సౌకర్యం కల్పించారు. కాగా ఈనెల రెండవ తేదీన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తన సిబ్బందితో కాలనీకి వచ్చే కల్వర్టును, రోడ్లను పరిశీలించారు. త్వరలో బురదమైన రోడ్లపై మొరం పోయిస్తానని కాలనీవాసులకు తెలపడం జరిగింది. వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టి కాలనీలో ఉన్న బురద రోడ్లపై మొరం పోయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# వర్షాలు పడినప్పుడే ప్రభుత్వాలు చేసిన పనులు బయటపడతాయి

## వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలి

## రావులపల్లి రోడ్డు, ఫతేపూర్ బ్రిడ్జి రోడ్డును పరిశీలించిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

## రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపిస్తా



శంకర్‌పల్లి సెప్టెంబర్ 04:(డైలీ రిపోర్ట్): వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, రైతులు అన్ని వర్గాల వారు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. శంకర్‌పల్లి మండలం రావులపల్లి కలాన్, ఫతేపూర్ రైల్వే వంతెన వద్ద వాహనదారుల ఇబ్బందులను బుధవారం ఎంపీ కొండ విశేశ్వర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడినప్పుడే ప్రభుత్వాలు, అధికారులు చేసిన తప్పులు బయటపడతాయని స్పష్టం చేశారు. రైల్వే వంతెన నిర్మించడం వల్ల క్రాసింగ్ లెవెల్ లేకపోవడంతో వరద నీరు బయటకు వెళ్లలేక పోతుందని, దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఇది అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాల్సిన విషయమని స్పష్టం చేశారు.వంతెన నిర్మించాం రోడ్డు వేశాం అంటే సరిపోదని, ఫ్లై ఓవర్ వంతెన నిర్మించేటప్పుడే సర్వీస్ రోడ్డు నిర్మించాలని, వర్షం కురిసిన సమయంలో ఆ నీరంతా వెళ్లే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద సిమెంట్ రోడ్డు వేశారని, నీరు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయకపోవడంతో నీరు నిలబడి వాహనాలు వెళ్లడం లేదన్నారు. ఇదంతా అధికారుల ముందుచూపు లేకపోవడమేనని స్పష్టం చేశారు. రైల్వే లెవెల్ క్రాసింగ్ దాటిన తర్వాత రైతుల పొలాలు 150 ఎకరాలు ఉంటాయని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించిన తర్వాత రైల్వే అధికారులు లెవెల్ క్రాసింగ్ మూసివేశారని, దీంతో వర్షపు నీరు వెళ్లకపోగా రైతులు కూడా పంట పొలాలకు వెళ్లలేకపోతున్నారని ప్రజలు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించారు. వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం చేసే విధంగా తాను కృషి చేస్తానని, రైల్వే అధికారులతో మాట్లాడి లెవెల్ క్రాసింగ్ ను తెరిపించి రైతులను పంట పొలాలకు వెళ్లే ఏర్పాట్లు చేయించడంతోపాటు, అవసరమైతే పట్టాల కింద నుంచి పైప్ లైన్ వేసి వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేస్తానన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని హామీ ఇచ్చి హామీలు పూర్తి చేయలేదని విమర్శించారు. పంట రుణాలు కూడా కేవలం 30 శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ అయ్యాయని, మిగతా 70 శాతం మంది రైతుల రుణాలు మాఫీ కాలేదని అవి ఎప్పటి వరకు చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పెద్ద మొత్తంలో వర్షం నష్టం జరగలేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వర్షాల వల్ల నష్టపోయిన వారికి పరిహారం చెల్లిస్తుందని, త్వరలోనే కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తుందని స్పష్టం చేశారు.

**రావులపల్లి కలాన్ రోడ్డును పరిశీలించిన ఎంపీ**

వికారాబాద్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రావులపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డు చెరువును తలపించేదిగా ఉండడంతో గ్రామస్తులు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి తమ సమస్యను చెప్పుకోవడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. రోడ్డును పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సమక్షంలోనే ఫోన్ చేసి రావులపల్లి కలాన్ గ్రామానికి కి వెళ్లే రోడ్డు ఎందుకు ఆలస్యం అవుతుందని అడిగి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు కిలోమీటర్ల దూరానికి 50 లక్షలు మంజూరయ్యాయని అవి సరిపోవని తెలపడంతో ఎంతవరకు ఆ నిధులతో రోడ్డు అవుతుందో అంతవరకు ఏర్పాటు చేయాలని ఎంపీ ఫోన్లో ఆదేశించారు. దీంతో గ్రామస్తులు చేవెళ్ల మాజీ ఎంపీటీసీ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని శాలువాతో సన్మానించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, మున్సిపల్ ఇన్చార్జి వాసుదేవ్ కన్నా, మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, 8వ వార్డు కౌన్సిలర్ రాములు, మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ హనుమంత్ రెడ్డి, నాయకులు కొలన్ గోవింద్ రెడ్డి, నరసింహారెడ్డి, పండిత్ రావు, మండల, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.



# వలస కుటుంబాలకు మౌలిక వసతుల కల్పనకు కృషి

- కాజిపల్లి లో పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన .
- బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ.
- ఓటరు జాబితా ఎస్ఎస్ఆర్ సర్వే పరిశీలన.
- బొల్లారం, కాజిపల్లి లో కలెక్టర్ క్రాంతి వల్లూరు పర్యటన.

**సంగారెడ్డి సెప్టెంబర్ 4 (డైలీ రిపోర్ట్):** కాజిపల్లి లోని వలస కుటుంబాలు కాలనీలో మౌలిక వసతులు మెరుగుకు కృషి చేయునట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బొల్లారం ,కాజిపల్లి గ్రామాలలో పర్యటించారు. కలెక్టర్ ముందుగా ఖాజిపల్లి గ్రామంలో జిఎంఆర్ కాలనిలో వలస కుటుంబాల తో సమావేశమయ్యారు . ఈ సందర్భంగా కలెక్టర్ వలస కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు . వలస కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం కావలసిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కాలనీలో పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీల చేశారు . ఈ సందర్భంగా అంగన్వాడి పాఠశాలను తనిఖీ చేశారు. జిన్నారం మండలంలో తాగునీటి ఎద్దడికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బొల్లారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు,సిబ్బందిపనితీరును పరిశీలించారు .ఈ సందర్భంగా బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్నా వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమయపాలన పాటించాలని వర్షాల కారణంగా వైరల్ ఫీవర్ లు, సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బొల్లారంలో బిఎల్వోలు సర్వే చేస్తున్న ఓటరు జాబితా ఎస్ఎస్ఆర్ పరిశీలనలో భాగంగా కలెక్టర్ ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితా సర్వే పరిశీలించారు . అనంతరం గ్రామ శివారులోని మాధవానికుంట చెరువును పరిశీలించారు. చెరువు ఎఫ్ టి ఎల్ పరిధివివరాలు అడిగితెలుసుకున్నారు.ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుకోవాలని అన్నారు . గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్ఎస్ఆర్ ఫండ్స్ కింద అవసరమైన మరమ్మత్తు పనులు మౌలిక వస్తువులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఏం %డ%హెచ్ ఓ గాయత్రీ దేవి , తహసీల్దార్ భిక్ష పతి , మునిసిపల్ చైర్మన్ రోజా బాల్ రెడ్డి , బొల్లారం మునిసిపల్ కమిషనర్ మంగతాయారు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# హైడ్రా పేరుతో రూ: 20 లక్షలు చీటింగ్ చేసిన ఫిజియోథెరపీ డాక్టర్ బండ్ల విప్లవ్ సిన్హా..




**సంగారెడ్డి, సెప్టెంబర్ (డైలీ రిపోర్ట్ ):** సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ నందు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బండ్ల విప్లవ్ సిన్హా తండ్రి అమీన్పూర్ గ్రామం మరియు మండలం, సంగారెడ్డి జిల్లాలో నివాసం ఉంటూ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గా పని చేస్తున్నారు. ఇతని సొంత గ్రామం ఖమ్మం పట్టణం జిల్లా. గత ఏడు సంవత్సరాలుగా అమీన్పూర్ లో అద్దె ఇంట్లో నివాసం ఉండేవాడు. అమీనపూర్ చుట్టుపక్కల ఉండే వ్యక్తుల మాదిరిగా ఖరీదైన ఇళ్లలో ఉంటూ విలాసవంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకుని, అమీన్పూర్ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించగా ఇక్కడ ఎక్కువగా నాన్ లోకల్ వారు ఉండి మరియు ప్రభుత్వ స్థలాల్లో, ఎఫ్ టీ ఎల్ మరియు బఫర్ జోన్ లలో అక్రమ ఇండ్ల నిర్మాణాలను చేపట్టడం గమనించి, వారిని ఎలాగైనా బెదిరిస్తే వారి వద్ద నుండి అధికంగా డబ్బులు వసూలు చేయవచ్చని నిర్ణయించుకొని అతని ఇంటికి సోషల్ వర్కర్ ఆక్టివిస్ట్ అని ఫ్లెక్సీ బోర్డు పెట్టుకున్నాడు. అప్పటినుండి చుట్టుపక్కల ప్రాంతాల్లో, చెరువులు, కుంటలకు ఆనుకొని మరియు ప్రభుత్వ స్థలంలో ఎవరైనా ఇల్లు కడితే అట్టి ఇంటి యజమానులు, బిల్డర్ల వద్దకు వెళ్లి వారిని బెదిరించి, వారి గురించి పేపర్ లో రాయిస్తాను అని కలెక్టర్, రెవెన్యూ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించి వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. గత కొంతకాలంగా నిందితుడు బండ్ల విప్లవ్ సిన్హా నివాసం ఉండే సాయి విల్లాస్, ఫ్యూజన్ స్కూల్ వెనకాల అమీన్పూర్ చెరువు నుండి వచ్చే నాలా కు అనుకొని ఏం సిఐ ఒ ఆర్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి. పేరుతో ఒక పెద్ద నిర్మాణ సంస్థ విల్లా నిర్మాణాలు చేయుచున్నది, అట్టి ప్రాజెక్టుకు వెళ్లేదారి అమీన్పూర్ చెరువు మధ్యలో నుండి కలదు. నిందితుడు అట్టి వ్యక్తుల వద్దకు వెళ్లి మీరు వేసిన రోడ్డు నాలా ప్రవాహానికి అడ్డు వస్తుంది, ఈ ప్రాజెక్టు అక్రమంగా నిర్మిస్తున్నారని చెప్పి వారిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించాడు. ఆగస్టు 15 నాడు హైడ్రా కమిషనర్ అయిన రంగనాథ్ అమీన్పూర్ కు వచ్చి వెళ్ళిన తరువాత ఆ రోజు రాత్రి నిందితుడు ఏం సిఐ ఒ అర్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి. రాజేందర్ కు వాట్స్ ఆప్ కాల్ చేసి వారిప్రాజెక్టు పక్కన గల ఇరిగేషన్ నాలా గురించి కలిసి మాట్లాడాలి అని అన్నాడు. దానికి అతను సరే అన్నాడు. ఆగస్టు 18 నాడు మధ్యాహ్నం పిస్తా హౌస్, అశోక్ నగర్ దగ్గర కలుద్దాం అని వాట్స్ ఆప్ ద్వారా మెసేజ్ చేశాడు. అతను దానికి అంగీకరించి ఆ రోజు కలవడం జరిగింది. అక్కడ నిందితుడు రంగనాథ్ సార్ తో దిగిన ఫోటోస్ చూపించి, రంగనాథ్ సారు కి చాలా దగ్గర అని, అమీన్పూర్ గురించి ఏదైనా నన్నే



అడుగుతాడు అని చెప్పి, ప్రాజెక్టు జోలికి రావోద్దు అంటే నాకు 20 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసి, చివరగా 16 లక్షలలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినాడు. దానికి గాను నేను వారికి అన్నీ రకాలుగా సహయంగా ఉంటానని లేకపోతే రోజు న్యూస్ పేపర్ లలో తప్పుగా రాయిస్తానని బెదిరించాడు. ఆ తరువాత కూడా రెండు మూడు సార్లు వాట్స్ ఆప్ ద్వారా మెసేజ్ లు చేశాడు. ఆ తరువాత మళ్ళీ తేదీ 25 ఆగస్టు నాడు గచ్చిబౌలి టీ ఎన్ జి ఓ కాలనీ నందు ఆఫ్రికాస్ కాపీ హౌస్ నందు కలుద్దాం అనగా ఆరోజు అక్కడ అతను, పార్టనర్ తో వచ్చి కలిసాడు. ఆ రోజు అడిగిన డబ్బులు ఇవ్వకుంటే రోజు పేపర్ లో ప్రాజెక్టు గురించి అసత్య ప్రచారం చేయిస్తానని, అదే విధంగా హైడ్రా కు ఫిర్యాదు చేస్తానని, డబ్బులు ఇస్తే పేపర్ లో రాకుండా మరియు హైడ్రా ఏమి చేయకుండా చూసుకుంటనని బెదిరించాడు. సెప్టెంబర్ 3 నాడు రాజేంద్రనాథ్, మంజునాథ్ రెడ్డి మరియు మరొక ఇద్దరు కలిసి నిందితుడు బండ్ల విప్లవ్ సిన్హా ఇంటికి వచ్చి అతను అడిగిన డబ్బులలో రాజేంద్రనాథ్ 2 లక్షల రూపాయలను అడ్వాన్స్ గా ఇవ్వగా, డికాయ్ ఆపరేషన్ లో ఉన్న టాస్క్ ఫోర్స్, అమీన్ పూర్ పోలీస్ వారు అట్టి డబ్బుతో సహ నిందితున్ని పట్టుకోని, క్రైమ్ నెంబర్ 563/2024 సెక్షన్ 308 (5) బి.యన్.యస్. ఆక్ట్ ప్రకారం అమీన్ పూర్ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎవరైనా హైడ్రా పేరుతో, బెదిరింపులకు పాల్పడితే అట్టి వ్యక్తుల గురించిన సమాచారాన్ని నేరుగా నా నెంబర్ 8712656777 కు ఫోన్ ద్వారా గాని వాట్స్ ఆప్ ద్వారా గాని సమాచారం అందించాలని, అట్టి వ్యక్తులపై చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రెస్ మీట్ నందు అదనపు ఎస్పీ. ఎ.సంజీవరావ్, అమీన్ పూర్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, సిసియస్ ఇన్స్పెక్టర్ మల్లేశం, యస్. బి. ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు?




**సంగారెడ్డి, సెప్టెంబర్ 4 (డైలీ రిపోర్ట్):** ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలు అతలాకుతం చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. భారీ వర్షాల కారణంగా పంటలు, ఇళ్లు, ముంపు ప్రాంతాల్లో నీట మునిగాయి. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదవుతోంది. ఆయా ప్రదేశాల్లో ఎంత వర్షపాతం నమోదైన విషయాలు మనం వింటూనే ఉంటాయి. ఇంతకి వర్షపాతాన్ని కొలిచే విధానం ఏ ప్రదేశంలోనైనా వర్షపాతాన్ని కొలవడానికి రెయిన్ గేజ్ ఉపయోగించబడుతుంది. ప్రపంచ దేశాలలో, వాతావరణ శాఖలు వర్షపాతాన్ని కొలవడానికి రెయిన్ గేజ్‌లను కలిగి ఉంటాయి. వర్షాన్ని రెయిన్ గేజ్‌తో అంగుళాలు లేదా మిల్లీమీటర్లలో కొలుస్తారు. ఈ రోజుల్లో అనేక రకాల రెయిన్ గేజ్‌లు ఉన్నాయి. కానీ ఇప్పటికీ పాత రెయిన్ గేజ్‌లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. రెయిన్ గేజ్‌లో స్కేల్‌తో కూడిన గాజు సీసా స్థూపాకార ఇనుప పెట్టెలో ఉంచుతారు. దీని తరువాత, సీసా నోటిపై ఒక గరాటు ఉంచుతారు. గాజు సీసాను బహిరంగ ప్రదేశం, సురక్షితంగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేస్తారు.

**పనిచేయు విధానం**

వర్షపు నీటి చుక్కలు గరాటులో పడిపోతుంటాయి. సీసాలో నీరు సేకరిస్తూనే ఉంటుంది. 24 గంటల వాతావరణం తర్వాత వాతావరణ శాఖ ఉద్యోగులు వచ్చి బాటిల్‌లో సేకరించిన నీటిని దానిపై అమర్చిన స్కేల్ సహాయంతో కొలుస్తారు. సంభవించే వర్షపాతం ఈ కొలతలో పదోవంతు. గరాటు వ్యాసం సీసా వ్యాసం కంటే పదిరెట్లు పెద్దది కాబట్టి, సీసాలో సేకరించిన నీరు కూడా పదిరెట్లు ఎక్కువ. ఈ పరికరాన్ని ఏర్పాటు చేయడానికి స్థలాన్ని ఎన్నుకునేటప్పుడు సమీపంలో ఏ చెట్లు లేదా ఎత్తైన గోడలు ఉండకుండా చూస్తారు. ఇలా చేయడానికి కారణం ఏ వస్తువుకు తగలకుండా వర్షం నీరు నేరుగా ఈ పరికరంలోకి పడటమే. దీంతో వర్షపాతాన్ని కచ్చితంగా కొలవవచ్చు.

**అధునాతన రాడార్, ఆటోమేటిక్ రెయిన్ గేజ్**

వాతావరణ శాస్త్రవేత్తలు కొన్ని చోట్ల రాడార్ ద్వారా వర్షపాతాన్ని కూడా కొలుస్తారు. రాడార్ ఉపయోగించే రేడియో తరంగాలు నీటి బిందువుల ద్వారా ప్రతిబింబిస్తాయి. ఈ ప్రతిబింబం కంప్యూటర్‌లో తరంగాల రూపంలో కనిపిస్తుంది. ఈ పాయింట్ల ప్రకాశాన్ని బట్టి వర్షం మొత్తం, తీవ్రత తెలుస్తుంది. ఈ రోజుల్లో వర్షాన్ని స్వయంచాలకంగా కొలిచే అటువంటి వర్షపు గేజ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.

**సగటు వర్షపాతం**

ఏడాది పొడవునా వర్షపాతం డేటా ఆధారంగా, వాతావరణ శాఖ ఒక ప్రదేశం సగటు వర్షపాతాన్ని కనుగొంటుంది. ఒక సంవత్సరంలో సగటు వర్షపాతం 254 మిమీ (10 అంగుళాలు) కంటే తక్కువగా ఉన్న ప్రదేశాలను ఎడారి అంటారు. ప్రతి సంవత్సరం 254 మిమీ నుండి 508 మిమీ (10 నుండి 20 అంగుళాలు) వర్షపాతం ఉన్న ప్రాంతాలు కొంత పచ్చదనం కలిగి ఉంటాయి. విజయవంతమైన వ్యవసాయం కోసం 20 అంగుళాల కంటే ఎక్కువ వర్షపాతం అవసరం అవుతుందని వాతావరణ శాఖ నిపుణులు తెలియజేశారు.

# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయ దంపతులకు అభినందనలు



**శంకర్పల్లి సెప్టెంబర్ 04:(డైలీ రిపోర్ట్):**శంకర్పల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాల కొండకల్ తాండ,మరియు ప్రాథమిక పాఠశాల పిల్లిగుండ్ల లో గత 14 సంవత్సరాలుగా ఇద్దరు సేవలందించి ఇటీవల జరిగిన బదిలీల్లో షాబాద్ మండలంలోని MPPS మన్మరి పాఠశాలకు బదిలీ అయిన మర్పల్లి అశోక్ సార్ మరియు శంకర్పల్లి మండలంలోని UPS గోపులారం పాఠశాలకు బదిలీ అయిన S బాలమణి మేడం గారు ఈరోజు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయ దంపతులకు రేపు హైదరాబాదులో రాష్ట్ర మంత్రులు, మరియు విద్యాధికారుల చేతుల మీదుగా అవార్డుల ప్రధానం జరగనుంది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707